నమస్తే తెలంగాణ
# మహబూబ్‌నగర్
నారాయణపేట
10 | మహబూబ్‌నగర్, సోమవారం 7 ఏప్రిల్ 2025 | MAHABUBNAGAR NARAYANPET



హైదరాబాద్ ప్రజాభవన్‌లో ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డికి ఇటీవల వినతిపత్రం అందజేస్తున్న పెబ్బేరు మండల గ్రామాల రైతులు (ఫైల్)

### ప్రభుత్వమే పంటలు కాపాడాలి..



నేను 50 ఎకరాల వరకు వరి శిస్తు చేసిన. కాల్వ నీరే ఆధారం. ఒక్క బోరుకానీ, బావి కానీ లేదు. కాల్వ నీళ్లు రాకుంటే మొత్తం ఎండిపోతుంది. ఇంకా మూడు తడులు కావాలి. లేకుంటే నా చేను చేతికి రాదు. రైతుల పరిస్థితిని అధికారులు, ఎమ్మెల్యేలు అర్థం చేసుకోవాలి. ఇంత ఘోరమైన పరిస్థితులుంటే.. మా పొలాలను ఎవరు చూడడం లేదు. కాల్వల కింద పంట పొలాలు ఎలా ఉన్నాయో చూడడానికి ఎవరు రావడం లేదు. చివరకు రైతులనే వాళ్ల దగ్గరకు తిప్పుకుంటున్నారు. ఎంత చెప్పినా చూద్దాం చేద్దాం అంటున్నారు. కానీ, నీరు రావడం లేదు. రామన్‌పాడ్ రిజర్వాయర్ నుంచి నీటి విడుదల చేయించి మా పంటలను కాపాడండి. ఎన్ని ఇబ్బందులు వచ్చినా ప్రభుత్వం మా పంటలను కాపాడాలి.

– సత్యారెడ్డి, రంగాపురం, పెబ్బేరు మండలం

### నీళ్లు రాకుంటే ఎకరా కూడా కష్టమే..



నేను 7 ఎకరాలు వరి శిస్తు చేసిన. జూరాల కాల్వ నీరే మాకు ఆధారం. వారబందీ అని చెప్పి నీటి విడుదల చేయడం లేదు. చేనంతా చేతికి వచ్చింది. నీరులేక మూడు ఎకరాలు ఎండి పోతుంది. ఇంకా నాలుగు ఎకరాలు అట్లట్ల ఉంది. నీరు రాకుంటే అది కూడా పోతుంది. ఒక బావి గుంత ఉంది. దాని ద్వారా ఒక ఎకరా పండే అవకాశముంది. ఆరెకరాలు కాల్వ నీరు రాకుంటే సర్కారు పుణ్యామా అని సమర్పయామి అవుతుంది. పెట్టుబడులు, మా కష్టం అన్ని వృథా అవుతాయి.

– గోకారి, రైతు, రాంపురం, పెబ్బేరు మండలం

### రెండు తడులు రాకుంటే నష్టం..



కనీసం రెండు తడుల వరకు నీరు రాకుంటే చాలా నష్టపోతం. 20 ఎకరాలు జూరాల కాల్వను నమ్మి వరి నాటాం. ఒక బావి ఉన్నా.. పొలం మొత్తానికి అందదు. అధికారులు, ఎమ్మెల్యే, మంత్రులను అందరికీ మొర పెట్టుకుంటున్నాం. చూస్తాం..చేస్తాం అంటున్నారు కానీ, నీరు మాత్రం రావడం లేదు. ఆశతో సాగు చేసినం. చివరి దశలో ఉన్నాయి. ఎమ్మెల్యేలు, మంత్రులు చొరవ తీసుకుని నీటి విడుదల చేయించాలి. లేకుంటే మా బతుకులు చిత్తలేవిడి అవుతాయి. గతంలో ఎప్పుడు ఇంతటి విపత్కర పరిస్థితిని రైతులు ఎదుర్కొంటున్నారు.

– శివరాజు, రైతు, రంగాపురం, పెబ్బేరు మండలం



రామన్‌పాడ్ రిజర్వాయర్ సమీపంలో నీరులేకుండా బోసిపోయిన జూరాల కాల్వ

- ప్రమాదపుటంచున జూరాల ఆయకట్టు
- మూడు తడులవసరమంటున్న రైతులు
- ప్రజాప్రతినిధులు, అధికారుల చుట్టూ ప్రదక్షిణలు
- నీళ్లు రావని ముందే చెప్పామంటున్న మంత్రులు, ఎమ్మెల్యేలు
- కర్ణాటక నుంచి నీటిని విడుదల చేయించని కాంగ్రెస్ సర్కార్
- ప్రజావాణి నుంచి ప్రజాభవన్ వరకు వినతులు
- క్షేత్రస్థాయిలో కానరాని ఇరిగేషన్ అధికారులు
- ప్రశ్నార్థకంలో 5వేల ఎకరాల వరి పంట

# చివరికి కన్నీళ్లే..

కాంగ్రెస్ సర్కారు నిర్లక్ష్యం జూరాల ఆయకట్టు రైతుల పాలిటశాపంగా మారింది. వాన కాలం పంటలు అంతంతమాత్రంగా రాగా, కనీసం యాసంగిలోనైనా కలిసొస్తుందనుకున్న కాలం కన్నీళ్లను మిగిల్చింది. జూరాల ప్రధాన ఎడమ కాల్వ కింద వరి పంటలు ప్రమాదంలో పడ్డాయి. ఇంకా రెండు లేదా మూడు తడుల నీటి విడుదల జరిగితే తప్పా పంట చేతికి అందని పరిస్థితి లేదు. వారబందీ పేరుతో నీటి విడుదల చేస్తున్న ఇరిగేషన్ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ చేయడంలేదు. ఇక మంత్రులు, ఎమ్మెల్యేల చుట్టూ రైతులు తిరుగుతూ నీటిని విడుదల చేయించాలంటూ ప్రదక్షిణలు చేస్తున్నారు. చివరకు కలెక్టరేట్‌లోని ప్రజావాణి నుంచి హైదరాబాద్‌లో నిర్వహించే ప్రజాభవన్ వరకు సాగునీటి విడుదల చేయాలని రైతులు వెళ్లి వినతులు ఇస్తున్నారంటే పరిస్థితులు ఎంతవరకు చేరుకున్నాయో రైతులపట్ల సర్కారుకు ఉన్న శ్రద్ధ ఇట్టే తెలిసిపోతున్నది.

– వనపర్తి, ఏప్రిల్ 6 (నమస్తే తెలంగాణ)

### మూడు తడులిస్తేనే ఆశలు..

వనపర్తి జిల్లా పరిధిలోని జూరాల ప్రధాన ఎడమ కాల్వ కింద సాగైన వరి పంటలు ప్రమాదపుటంచున ఉన్నాయి. ఇంకా మూడు తడులు నీటి విడుదల జరిగితే వంద శాతం, రెండు త డులు నీటిని విడుదల చేస్తే 80 శాతం పంటలు చేతికి వచ్చే అవకాశముందని అన్నదాతలు అంచనా వేస్తున్నారు. లేదంటే భారీగా జూరాల ఆయకట్టు కింద వేసిన వరి పంటలే ఎండి పోవడానికి సిద్ధంగా ఉన్నాయి. ప్రస్తుతం జూరాల ప్రాజెక్టులో నీటిశాతం ఆశాజనకంగా లేదు. ఎగువ నుంచి ఆశించినంత నీరు జూరాలకు రాకపోవడం వల్ల ఈ పరిస్థితి ఏర్పడింది. మంత్రుల బృందం కర్నాట కు వెళ్లినప్పుడు చెప్పిన 4 టీఎంసీల నీటి విడుదలైనా చేసి ఉంటే ఈ దుస్థితి ఉండేది కాదు. కేవలం ప్రచారం కోసం అన్నట్లుగా వెళ్లి వచ్చారే తప్పా నీటివిడుదల చేయిచండంలో పూర్తిగా కాంగ్రెస్ సర్కార్ విఫలమైంది. అరకొరగా ఒక టీఎంసీ నీరు వచ్చిందని చె బుతున్నా ఏమూలకు సరిపోవడం లేదు. ఈ పరిస్థితి వల్లనే ఇప్పుడు జూరాల ఆయకట్టు రైతులు అవస్థలు పడుతున్నారు.

### ప్రమాదంలో 5వేల ఎకరాలు..

జూరాల ప్రాజెక్టు పరిధిలోని ఎడమ కాల్వ కింద 5వేల ఎకరాల వరి చేలు నీరందక ప్రమాదంలో పడుతున్నాయి. రామన్‌పాడ్ రిజర్వాయర్ నుంచి విడుదల చేయాల్సిన నీటిని పూర్తిగా నిలిపి వేయడంతో ఆయకట్టు భూములకు నీరందని పరిస్థితి ఏర్పడింది. పెబ్బేరు మండలం వైశాగాపురం, రామాపురం, కొత్తూరు, పామాపురం, రంగాపురం, బున్యాదిపురం పరిధిలోని జూరాల ఆయకట్టు భూములకు నీరందక పోవడంతో చేతికందే దశలో ఇరకాటంలో పడ్డాయి. కనీసం రెండు తడులైనా విడుదల చేస్తే తప్పా ఈ పంటలు చేతికి రావు. ఇందుకు రైతులు చేయని ప్రయత్నమంటూ లేదు. పెద్దరోగమొస్తే.. కనిపించిన దేవుడికి మొక్కినట్లుగా జిల్లాలో ఎక్కడైనా మంత్రులు, ఎమ్మెల్యేలు పర్యటిస్తున్నారంటే రైతులు పరుగులు తీసి నీటి విడుదల చేయించాలని మొరపెట్టుకున్నారు.

### ప్రజా భవన్‌కు వెళ్లి వినతులు..

లక్షలాది రూపాయలు పెట్టుబడి పెట్టిన తమ పంట పొలాలు ప్రమాదంలో పడుతున్నాయని తెలిసి రైతులు వినతుల బాట పట్టారు. కలెక్టరేట్‌లోని ప్రజావాణి నుం చి హైదరాబాద్ ప్రజాభవన్‌లో నిర్వహించే ప్రజాదర్బార్ వరకు వెళ్లి రైతులు వినతులు చేస్తున్నారు. రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డిని కలిసి వినతి పత్రం ఇచ్చిన రైతులు అటు నుంచి రాష్ట్ర కార్యదర్శి శాంతకుమారిని కలిసి సాగు నీటి విడుదలకు మొర పెట్టుకుంటున్నారంటే సాగునీటి దీనస్థితి అర్థమవుతుంది. అయినా.. ప్రభుత్వంలో ఎలాంటి చలనం లేదు. పరిస్థితి చేయిదాటి పోతుంటే చూడలేని రైతులు కొన్ని చోట్ల షెట్టర్సను బలవంతంగా తీసి నీటిని తీసుకెళ్తున్నారు. మంగళవారం ప్రజాభవన్‌కు వెళ్లి రాష్ట్ర కార్యదర్శిని కలిసి రైతులు రెండు తడుల వరకు నీటిని విడుదల చేయక పోతే తాము తీవ్రంగా నష్టపోతామని మొరపెట్టుకున్నారు. కర్ణాటక అధికారులతో మాట్లాడి నీటి విడుదల చేయిస్తామని కార్యదర్శి చెప్పినా ఇప్పటి వరకు స్థానిక ఇరిగేషన్ అధికారులు స్పందించడం లేదని రైతులు వాపోతున్నారు.

### మంత్రులు, ఎమ్మెల్యేల దగ్గరకు వెళ్తే..

సాగునీటి విడుదలకు మంత్రులు,ఎమ్మెల్యేల దగ్గరకు రైతులు గంపెడాశతో పరుగులు తీస్తున్నారు. తీరా అక్కడికి వెళ్లిన అనంతరం రైతులకు చుక్కెదురవుతుంది. ఎందుకు పంటలు వేశారని, ముందే నీళ్లు రావని అధికారులు చెప్పడం జరిగిందని.. ఇప్పుడు నీళ్లు కావాలంటే ఎక్కడి నుంచి తెచ్చేదంటూ చెబుతున్నారని రైతులు ఆవేదన చెందుతున్నారు. రైతుల ఒత్తిడిమేరకు బలవంతంగా ఓ ఫోన్ చేసినా అది ఏమాత్రం ఫలప్రయోగం కావడం లేదు. చివరకు రైతుల కంట పడకుండానే జారుకోవాలనే ప్రయత్నంలో ఎమ్మెల్యేలు, మంత్రులు జాగ్రత్తలు తీసుకుంటున్నారు.

ఈనెల రోజులు సాగు నీటి తాకిడి ఉందని, రైతులకు ఎలాంటి సమాధానం చెప్పినా ప్రయోజనం ఉండదని గ్రహించిన ప్రజాప్రతినిధులు తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారు. రామన్‌పాడ్ రిజర్వాయర్‌లో నీటిమట్టం ఆశాజనకంగా ఉందని, కనీసం ఒక్క తడికైనా నీటి విడుదల చేయించండి మహాప్రభో అంటే ఏ ఒక్కరు రైతుల కోసం ప్రయత్నించడం లేదని వాపోతున్నారు.

### క్షేత్రస్థాయిలో కనిపించని ఇరిగేషన్ అధికారులు

ఎక్కడికక్కడ జూరాల ఆయకట్టు పొలాలే ఎండిపోయే దశలో ఉండగా ఇరిగేషన్ అధికారుల జాడ మాత్రం కనిపించడం లేదు. ఏఈల నుంచి ఎస్ఈల వరకు హైదరాబాద్ నుంచి ఆపరేషన్ చేస్తున్నారన్న విమర్శలు వెలువడుతున్నాయి. వారంలో రెండు రోజులు ఇక్కడ కనిపించినట్లు చేసినా.. మళ్లీ ఆఫీసు పనంటూ హైదరాబాద్‌లోనే మకాం పెడుతున్నట్లు రైతులు గోసపడుతున్నారు. ఇంత దయనీయమైన పరిస్థితిలో రైతులు కాకవికలమవుతుంటే క్షేత్రస్థాయిలో పరిశీలన.. పర్యవేక్షణ చేయాల్సిన సాగునీటి అధికారులు రైతులకు కనిపించకుండా తిరగడం విచారకరం. అటు ప్రజా ప్రతినిధులు, ఇటు ఇరిగేషన్ అధికారులు ఎవరికి వారు అన్నట్లుగా వ్యవహరిస్తుండడంతో యాసంగిలో పంటలు సాగు చేసిన రైతులు దిక్కులేనివారైనట్లు కనిపిస్తుంది. మొన్నటిదాకా బోరు, బావుల కిందనే యాసంగి పంటలు ఎండిపోతున్నాయని భావించిన క్రమంలో ఇప్పుడు జూరాల ఆయకట్టు కింద కూడా ఇలాంటి పరిస్థితి రావడం ఆందోళన కల్గిస్తుంది.


# కల్యాణం.. కమనీయం



వనపర్తిలో పూజలు చేస్తున్న మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి



ఉత్సవ విగ్రహాలను కల్యాణానికి తీసుకొస్తున్న మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ దంపతులు



పుల్లూరు : పూజలు చేస్తున్న అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు

శ్రీరామనవమిని పురస్కరించుకొని సీతారాముల కల్యాణాన్ని ఆదివారం ఉమ్మడి పాలమూరు జిల్లాలో కనుల పండువగా నిర్వహించారు. నాగర్‌కర్నూల్ జిల్లా చారకొండ మండలం సిర్సనగండ్ల, గద్వాల జిల్లాలోని బీచుపల్లి, మహబూబ్‌నగర్‌లోని రామాలయంలో వేదమంత్రాలతో అర్చకులు కల్యాణ తంతు నిర్వహించగా, భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి వేడుకను తిలకించారు. ఈ సందర్భంగా వనపర్తిలోని సాయినగర్ కాలనీ రామాలయంలో కల్యాణోత్సవానికి మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి హాజరై ప్రత్యేక పూజలు చేశారు. అలాగే మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ హైదరాబాద్‌లోని కూకట్‌పల్లి బాలాజీనగర్ కాలనీలోని కనకదుర్గ ఆలయంలో, పాలమూరు జిల్లా కేంద్రంలో, హన్వాడ మండలంలోని రామాలయాల్లో కల్యాణ వేడుకను తిలకించి పూజలు నిర్వహించారు. ఉండవల్లి మండలం పుల్లూరులో సీతారాముల కల్యాణ మహోత్సవంలో అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు పాల్గొన్నారు.

– నమస్తే తెలంగాణ నెట్‌వర్క్, ఏప్రిల్ 6

# అకాల వర్షం.. తడిసిన ధాన్యం



వేములలో తడిసిన ధాన్యం



నీళ్లు ఎత్తిపోస్తున్న రైతు

మూసాపేట, ఏప్రిల్ 6: అన్నదాతలపై ప్రకృతి పగబట్టింది. సగం పంటలు సాగునీరు అందక ఎండిపోగా, మరికొంత పంట వడగండ్ల వానతో పంట పొలంలోనే ధాన్యం రాలిపోయింది. అష్టకష్టాలు పడి పండించిన ధాన్యం ఆదివారం ఆరబెట్టగా.. అకాల వర్షం రావడంతో మొత్తం తడిసి ముద్దయింది. అరబెట్టిన ధాన్యాన్ని వర్షానికి తడవకుండా కాపాడుకోవడానికి అన్నదాతులు ఉరుకులు, పరుగులు పెట్టారు. మూసాపేట మండల కేంద్రంతోపాటు, వేముల, తుంకినిపూర్, జానంపేట, కొమిరెడ్డిపల్లి, సంకలమద్ది తదితర గ్రామాల్లో రైతులు వరిధాన్యం ఆరబెట్టారు. మధ్యాహ్నం తర్వాత వర్షం ఒక్కసారిగా రావడంతో రోడ్లపై ఆరబెట్టిన ధాన్యం మొత్తం తడిసిపోయింది. వర్షానికి కొట్టుకుపోయింది. ధాన్యం తడిసిపోవడంతో రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది.

### పిడుగుపాటుకు గురై ఆవు మృతి..

వంగూరు, ఏప్రిల్ 6: మండలంలోని వివిధ గ్రామాల్లో ఆదివారం సాయంత్రం ఉరుములు, మెరుపులతో కూడిన అకాల వర్షం కురిసింది. దీంతో వంగూరు మండల కేంద్రానికి చెందిన ఈరటి లక్ష్మయ్య వ్యవసాయ పొలంలో కట్టేసిన ఆవు పిడుగుపాటుకు గురై మృతిచెందింది. ఆవు విలువ సుమారు రూ.80వేలు ఉంటుందని రైతు లక్ష్మయ్య బోరున విలపించాడు.

# రజతోత్సవానికి లక్షలాదిగా తరలివెళ్దాం

- మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్ రెడ్డి



బీఆర్ఎస్ ముఖ్య నాయకులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి

కొల్లాపూర్, ఏప్రిల్ 6: వరంగల్‌లో ఈ నెల 27న నిర్వహించే బీఆర్ఎస్ రజతోత్సవ సభను విజయవంతం చేసేందుకు కొల్లాపూర్ నుంచి బీఆర్ఎస్ సైనికులు లక్షలాదిగా తలలి వెళ్దామని మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్ రెడ్డి కొల్లాపూర్ పట్టణ, బీఆర్ఎస్ మండల నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఆదివారం కొల్లాపూర్ పట్టణంలోని మాజీ ఎమ్మెల్యే స్వగృహంలో కొల్లాపూర్ పట్టణ, మండల ముఖ్యనేతలతో బీఆర్ఎస్ ఆవిర్భావ, రజతోత్సవ మహాసభ సన్నాహక సమావేశం నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్ రెడ్డి ముఖ్య నాయకులకు దిశానిర్దేశం చేశారు. బీఆర్ఎస్ రజతోత్సవ సభకు కొల్లాపూర్ నుంచి భారీ సంఖ్యలో తరలి వెళ్లి సభను విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో బీఆర్ఎస్ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.


# మర్రికి శుభాకాంక్షల వెల్లువ

- ఘనంగా మాజీ ఎమ్మెల్యే జన్మదిన వేడుకలు
- శుభాకాంక్షలు తెలిపిన మాజీ మంత్రి సింగిరెడ్డి, పలువురు నాయకులు



మర్రి జనార్దన్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలుపుతున్న మాజీ మంత్రి సింగిరెడ్డి

నాగర్‌కర్నూల్, ఏప్రిల్ 6: నాగర్‌కర్నూల్ మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి పుట్టిన రోజు వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి మర్రి నివాసానికి వెళ్లి పుష్పగుచ్ఛం అందజేసి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. అదేవిధంగా నియోజకవర్గంలోని నాగర్‌కర్నూల్, తెలకపల్లి, బిజినేపల్లి, తాడూరు, తిమ్మాజిపేట మండలాల బీఆర్ఎస్ నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. మర్రికి గజమాల వేసి కేక్‌కట్ చేయించారు. నాగర్‌కర్నూల్‌కు చెందిన పలువురు ముస్లిం, మైనార్టీ నాయకులు మర్రిని కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో నియోజకవర్గంలోని అన్నిమండలాల ముఖ్యనాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



హైదరాబాద్‌లో మర్రితో కేక్ కట్ చేయిస్తున్న బీఆర్ఎస్ నాయకులు













